క్లుప్తంగా

కొత్త జీవన ప్రస్థానానికి ఉద్యోగ విరమణ ఆరంభం



నందిగామ రూరల్: ఒక కొత్త జీవన ప్రస్థానానికి ఉద్యోగ విరమణ ఆరంభమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు పేర్కొన్నారు. చందర్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం మద్దినేని నాగేశ్వరరావు ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని పట్టణంలోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దటంలో ఉపాధ్యాయుల కృషి అనిర్వచనీయమైనదని తెలిపారు. అనంతరం మద్దినేని దంపతులను ఉపాధ్యాయులు, సహచరులు సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ మండవ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులకు అండగా ఉంటాం



నందిగామ రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వైద్య సేవలందిస్తున్న గ్రామీణ వైద్యులకు ప్రభుత్వం అండగా ఉంటుందని నందిగామ, జగ్గయ్యపేట శాసనసభ్యులు తంగిరాల సౌమ్య, శ్రీరాం రాజగోపాల్ పేర్కొన్నారు. రూరల్ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం-ఏపీ రాష్ట్ర, డివిజన్, నియోజకవర్గాల ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని స్థానిక ఆర్ఎస్ గార్డెన్స్లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో గ్రామీణ వైద్యులు ఎనలేని సేవలందిస్తున్నారన్నారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి గ్రామీణ ప్రజలకు మరింత మేలు చేసేలా కొత్తతరం వైద్యులు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ మండవ కృష్ణకుమారి పాల్గొన్నారు.

డాక్టర్ అనిల్కుమార్ సేవలు స్ఫూర్తిదాయకం



జగ్గయ్యపేట అర్బన్: ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ అనిల్కుమార్ వైద్య సేవలు స్ఫూర్తిదాయకం అని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. డాక్టర్ అనిల్కుమార్ ఉద్యోగ విరమణ కార్యక్రమం ఆదివారం స్థానిక హోటల్ గ్రాండ్ వధూవర్లో నిర్వహించారు. ఎమ్మెల్యే దంపతులు పాల్గొని డాక్టర్ అనిల్కుమార్ దంపతులను సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనేది జీవితంలో ఒక విశిష్టమైన మైలురాయి అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అనిల్కుమార్ మిత్రబృందం మాశెట్టి రమేష్బాబు, కర్లపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విఘ్నాలు తొలగాలని ప్రత్యేక పూజలు



కంచికచర్ల : ప్రతి ఒక్కరి విఘ్నాలు తొలగిపోవాలని ఆ గణేషుడి ఆశీస్సులు మెండుగా ఉండాలని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్బాబు పేర్కొన్నారు. స్థానిక సింగవరపు శ్రీనివాసరావు ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసిన వినాయకుడికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 500మంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దేవిరెడ్డి శ్రీనివాసరావు, ఆకుల రామారావు, పొన్నపల్లి శ్రీనివాసరావు, మండల శివ, ప్రసాద్, శ్యాం, కృష్ణమూర్తి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ త్రీమెన్ కమిటీల నియామకం

నందిగామ రూరల్: మండలంలోని ఆయా గ్రామాల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు త్రీమెన్ కమిటీలను నియమిస్తూ విజయవాడ డివిజన్ కో-ఆపరేటివ్ ఉన్నతాధికారులు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని కొణతమాత్మకూరు గ్రామ సొసైటీ చైర్మన్గా చెరుకూరు సాంబశివరావు, సభ్యులుగా కాంబోజి కొండ, దగ్గుపాటి నిర్మల నియమితులయ్యారు. మాగల్లు సొసైటీ చైర్మన్గా సూరంపల్లి అప్పారావు, సభ్యులుగా గరిగంటి భద్రమ్మ, కొత్రకంటి ముక్కంటయ్య, ఐతవరం సొసైటీ చైర్మన్గా మద్దుకూరి రామారావు, సభ్యులుగా చలమల వెంకట్రావమ్మ, గాలి రమేష్బాబును నియమించారు.

అధ్వానంగా చిల్లకల్లు-పెనుగంచిప్రోలు రోడ్డు

వత్సవాయి: చిల్లకల్లు-పెనుగంచిప్రోలు రోడ్డు అధ్వానంగా ఉండటంతో వాహనచోదకులు, ప్రజలు అవస్థలుపడుతున్నారు. నాలుగు నెలల కిందటే మరమ్మతులు చేపట్టినప్పటికీ రోడ్డంతా తిరిగి గుంతలమయం కావడంపై వాహనచోదకుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. పెనుగంచిప్రోలులోని లక్ష్మీతిరుపతమ్మ అమ్మవారి ఆలయానికి నిత్యం అధిక సంఖ్యలో భక్తులు ఈ మార్గం నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. ముఖ్యంగా శుక్ర, ఆదివారాల్లో వేలాది మంది భక్తులకు గోతులమయమైన ఈ మార్గంలో ప్రయాణం చేయలేక ఇబ్బందులు పడుతున్నారు.

రాత్రి సమయాల్లో గుంతలు కనపడక ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చిల్లకల్లు-పెనుగంచిప్రోలు రోడ్డులో గుంతలను పూడ్చించాలని వాహనచోదకులు, భక్తులు కోరుతున్నారు.



చిల్లకల్లు ఎస్సీకాలనీ వైఎస్సార్ విగ్రహం వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు



మక్కపేట శివారులో రోడ్డు మధ్యలో పడిన భారీ గుంత



పెనుగంచిప్రోలు శివారులో రోడ్డు దుస్థితి

కృష్ణానది వద్ద నిమజ్జనాల సందడి

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలోని యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ సమీపంలోని కృష్ణానది వద్ద ఆదివారం వినాయక నిమజ్జనాలు సందడిగా సాగాయి. ఐదు రోజుల పాటు మంటపాల్లో కొలువుదీరిన గణనాథులను నిమజ్జనానికి నిర్వాహకులు అంగరంగ వైభవంగా ఊరేగింపుగా తరలించారు. అనంతరం కృష్ణానదిలో నిమజ్జనాలు చేశారు. నిమజ్జనాల వద్ద ఎటువంటి ఇబ్బందులు లేకుండా చిల్లకల్లు ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్ ఆధ్వర్యంలో ట్రైనీ ఎస్ఐ మణికంఠ బందోబస్తు నిర్వహించారు. పట్టణంలోని సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతికి సీఐ వెంకటేశ్వర్లు దంపతులు ప్రత్యేక పూజలు చేసి ఆ ప్రాంతంలోనే నీటితో నిమజ్జనం చేశారు.



సీఐ కార్యాలయం వద్ద గణనాథుడి నిమజ్జనం



కృష్ణానదిలో గణనాథుల నిమజ్జనాలను పరిశీలిస్తున్న పోలీసులు

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



క్యూలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



చండీహోమంలో పాల్గొన్న భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావటంతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. దీంతో ఆలయ క్యూలు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువ జామునుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం చుట్టూ అమ్మవారి రథోత్సవం నిర్వహించారు. యాగశాలలో వేద పండితుల ఆధ్వర్యంలో చండీహోమం నిర్వహించారు.

పెట్రోల్ బంకు వద్ద ఆందోళన

గౌరవరం(జగ్గయ్యపేట): గ్రామంలోని హెచ్పీ పెట్రోల్ బంకు వద్ద డీజిల్లో నీరు కలిసిందంటూ శనివారం రాత్రి వాహనదారులు ఆందోళన చేశారు. మండలంలోని బండిపాలెం గ్రామంలో వినాయక చవితి నిమజ్జనం సందర్భంగా కార్లు, బైకులు, తదితర వాహనాలను డీజిల్, పెట్రోల్ కొట్టించేందుకు బంకు వద్దకు తీసుకొచ్చారు. ఆటోకు డీజిల్ కొట్టిస్తుండగా డీజిల్కు బదులు నీరు వచ్చిందని.. దీని కారణంగా వాహనం స్టార్ట్ కాలేదని వాహనదారులు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న ఇన్చార్జ్ తహసీల్దార్ మనోహర్, చిల్లకల్లు ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్ అక్కడకు చేరుకుని వాహనదారులతో మాట్లాడారు. డీజిల్లో నీరు వస్తుందని అడిగినా సమాధానం కూడా చెప్పటం లేదని వాహనదారులు తెలిపారు. దీనిపై స్పందించిన అధికారులు శాంపిల్స్ ల్యాబ్కు పంపుతామని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు.

అయిలూరికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

వీరులపాడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అయిలూరి నర్సిరెడ్డిని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు ఆదివారం పరామర్శించారు. మండలంలోని కొణతాలపల్లి గ్రామానికి చెందిన నర్సిరెడ్డి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జగన్మోహనరావు గ్రామంలోని ఆయన నివాసంలో పరామర్శించి వైద్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అవుల రమేష్బాబు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి పాల్గొన్నారు.



నర్సిరెడ్డిని పరామర్శించి, మెడికల్ రిపోర్టులు పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగన్మోహనరావు

విద్యార్థులు క్రీడల్లో ఆసక్తి చూపాలి

వీరులపాడు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ఆసక్తి చూపాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. మండలంలోని జమ్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల విజేతలకు ఆదివారం ఆమె బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించటం అభినందనీయమన్నారు.

నీట్ పీజీలో 248 ర్యాంకు సాధించిన నిఖిల్కు అభినందన

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మాలోతు శ్రీహరి కుమారుడు నిఖిల్ జాదవ్ ఇటీవల ప్రకటించిన నీట్ పీజీ ఫలితాల్లో ఆలిండియా క్యాటగిరిలో 248 ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా ఆదివారం మాలోతు శ్రీహరి, నిఖిల్ జాదవ్ ఎమ్మెల్యే తాతయ్యను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే తాతయ్య నిఖిల్ జాదవ్ను సన్మానించి అభినందించారు.



ఘనంగా పుష్పయాగం

నందిగామ టౌన్: పట్టణంలోని ప్రధాన వీధుల్లో కొలువుదీరిన గణనాథులకు నిర్వాహకులు ఆదివారం పూజలు నిర్వహించారు. స్థానిక గాంధీ సెంటరులో ఏర్పాటు చేసిన గణనాథుని మంటపంలో అలివేలు మంగా పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి వారికి పుష్పయాగం కార్యక్రమాన్ని ఘనంగా జరిపించారు. అర్చక స్వామి పరాంకుశం పవన్ కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు జరిపించారు. అదేవిధంగా మార్కెట్లోని గణనాథుని మంటపం వద్ద ప్రత్యేక హోమాది క్రతువులను నిర్వహించారు.

దివ్యాంగుల హక్కులపై పోరాటం

ఉయ్యూరు: దివ్యాంగుల హక్కుల సాధన కోసం కృషి చేస్తున్నామని వికలాంగుల హక్కుల పోరాట సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ ఆరేపల్లి శివసాయిప్రసాద్ అన్నారు. వీహెచ్పీఎస్ 18 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉయ్యూరులో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పోరాట సమితి ప్రతినిధులు కేక్ కట్చేసి మిఠాయిలు పంచారు. శివసాయి ప్రసాద్ మాట్లాడుతూ.. దివ్యాంగుల హక్కుల సాధనకు పోరాట సమితి స్థాపించామన్నారు. కార్యక్రమంలో సమితి ఉయ్యూరు అధ్యక్షుడు ముజీబ్, మహిళా అధ్యక్షురాలు నూకల రజని పాల్గొన్నారు.



ఉయ్యూరులో కేక్ కట్ చేస్తున్న పోరాట సమితి ప్రతినిధులు

భక్తిశ్రద్ధలతో నవరాత్రులు

వత్సవాయి: వినాయక నవరాత్రి ఉత్సవాలు గ్రామాల్లో భక్తిశ్రద్ధల మధ్య కోలాహలంగా సాగుతున్నాయి. ఆదివారం ఐదో రోజు పూజలు ఘనంగా నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో మూడు రోజులు పూజలు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. మరికొన్ని గ్రామాల్లో ఐదు రోజుల పూజలు అనంతరం సోమవారం నిమజ్జనాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కొన్నిచోట్ల నవరాత్రులు నిర్వహించిన తరువాత నిమజ్జనాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఆయా గ్రామాల్లో విగ్రహాల వద్ద రాత్రి పూజాకార్యక్రమాలు అనంతరం స్వామి చేతిలో పెట్టిన లడ్డూలకు వేలంపాట నిర్వహిస్తున్నారు. మక్కపేటలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామివారి వద్ద 101 కేజీల లడ్డూకు వేలంపాట నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు. కాగా నిమజ్జనాల సందర్భంగా నిర్వాహకులు జాగ్రత్తలు వహించాలని ఎస్ఐ ఉమామహేశ్వరరావు తెలిపారు.



మక్కపేటలో 101 కేజీల లడ్డూ

పెనుగంచిప్రోలులో..

పెనుగంచిప్రోలు: గణపతి నవరాత్రుల్లో ఐదో రోజు ఆదివారం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో మట్టి గణనాథుడికి ప్రత్యేక పూజలతో పాటు గణపతి హోమం నిర్వహించారు. గణేష్ ఉత్సవాల్లో భాగంగా వినాయక చవితి పందిళ్లలో గణనాథునికి విశేష పూజలు చేశారు.

జై బోలో గణేష్ మహరాజ్కీ జై

నందిగామ రూరల్: వినాయక చవితి సందర్భంగా ప్రత్యేక మంటపాలలో కొలువుదీరిన గణనాథులను ఐదో రోజు ఆదివారం ఉదయం నుంచే నిమజ్జనానికి తరలించారు. ఐదు రోజుల నుంచి ప్రత్యేక పూజలందుకున్న గణనాథుడిని పలు రకాలు పుష్పాలు, విద్యుత్ దీప కాంతులతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై తీన్మార్ వాయిద్యాలు, భక్తుల డ్యాన్సులు నడుమ అంగరంగ వైభవంగా ఊరేగింపుగా కృష్ణానదిలో నిమజ్జనం చేసేందుకు తరలించారు. ఈ సందర్భంగా భక్తులు 'జై బోలో మహరాజ్కీ జై' అంటూ వాహనాల ముందు ఉత్సాహంగా వెళ్లారు. పలు వినాయక విగ్రహాల నిమజ్జన వాహనాల ఎదుట మహిళలు కోలాటమాడుతూ సందడి చేశారు. వినాయక నిమజ్జనాల సందర్భంగా పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. నిమజ్జనాల సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ వైవీఎల్ నాయుడు తెలిపారు.



మక్కపేట ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో గణపయ్య



జగ్గయ్యపేట చాకలి బజారులో ఏర్పాటు చేసిన గణనాథుడు

జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేట అర్బన్: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో ఆదివారం ఐదో రోజున పలు వార్డులలోని మండపాల్లోని గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

అలరించిన నృత్య పోటీలు

పట్టణంలోని ఆకులవారి వీధిలోని వినాయకుని పందిరిలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నృత్య పోటీలు అలరించాయి. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. శ్రీరాఘవేంద్ర ఫుడ్స్, ఆకీరా గోల్డ్ వారు స్పాన్సర్గా ఉండి అందించిన బహుమతులను విజేతలు పెద్దాపురపు వాగ్దేవి, మంగళగిరి హిరణ్య, ఇక్కుర్తి అస్మితలకు చైర్మన్ అందజేశారు. అదేవిధంగా వివిధ కూడళ్లలోని చవితి పందిళ్లలో ఏర్పాటు చేసిన గణేషుని విగ్రహాలు అట్టహాసంగా నిమజ్జనానికి తరలివెళ్లాయి.

జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేట: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక మంటపాల్లో కొలువుదీరిన గణనాథులకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని షేర్మహ్మద్పేట, బండిపాలెం, చిల్లకల్లు, అనుమంచిపల్లి, జయంతిపురం, ముక్త్యాల గ్రామాలలోని గణనాథులకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని బ్రాహ్మణ బజారులో లంబోధర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంటపంలో మహిళలు సామూహిక కుంకుమార్చనచేశారు. చాకలి బజారులో వేంచేసియున్న వినాయకుడికి పూజలు చేశారు.



శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో పూజలందుకున్న గణనాథుడు

వీరులపాడులో..

వీరులపాడు: మండలంలోని పలు గ్రామాల్లో, వెల్లంకిలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన గణనాథులకు ఆదివారం విశేష పూజలు చేశారు. రాత్రికి వెల్లంకి గ్రామంలోని గణనాథుడిని పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఊరేగించి నిర్వాహకులు నిమజ్జనానికి తరలించారు. కమిటీ సభ్యులు వెంకటేశ్వరరావు, వినయ్, సాంబ, వేణుగోపాలరెడ్డి, వెంకట్రావమ్మ, లక్ష్మీ, విశాల పాల్గొన్నారు.



వెల్లంకిలో గణనాథుడికి పూజలు

కంచికచర్లలో..

కంచికచర్ల : స్థానిక విజయరాణి ఉన్నత పాఠశాల రోడ్డులో హనుమాన్ పేటగణేష్ యూత్ ఏర్పాటు చేసిన గణనాథుడు ఆదివారం నిమజ్జనానికి తరలివెళ్లారు. ఉత్సవ విగ్రహ కమిటీ అధ్యక్షుడు సాంబశివరావు ఆధ్వర్యంలో స్వామి వారి లడ్డూను వేలం వేశారు. నాగినేని లక్ష్మయ్య రూ.10,116కు దక్కించుకున్నారని తెలిపారు. అనంతరం అన్నదానం చేశారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ఇబ్రహీంపట్నంలోని ఫెర్రి కృష్ణానదికి తరలించారు.



నందిగామలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు



పేటలోని ఆకులవారి వీధిలోని గణేష్ విగ్రహం వద్ద పూజలో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర



పేటలోని ముక్త్యాల రోడ్డులో నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు



జగ్గయ్యపేట బ్రాహ్మణ బజారులో నిర్వహించిన సామూహిక కుంకుమార్చనలో భక్తులు



కంచికచర్లలో నిమజ్జనానికి తరలివెళుతున్న గణనాథుడు

పాస్పోర్ట్ పోయినది

మిట్టపల్లి వినూత్న D/o. రమేష్, జగ్గయ్యపేట పట్టణం & మండలం, NTR జిల్లా అను నాపేరున, "P0262983" నెంబరు గల పాస్పోర్ట్ జగ్గయ్యపేట బస్టాండ్ నుండి మా ఇంటికి వెళుతుండగా మార్గమధ్యలో పోయినది. ఎవరికైనా దొరికిన యెడల పై అడ్రస్సుకు అందించగలరని కోరుచున్నాను.

మిట్టపల్లి వినూత్న, C/o. ఉప్పల దుర్గాప్రసాద్
ఫోన్ : 99481 40075

నేడు పీజీఆర్ఎస్

కంచికచర్ల : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బీఎం విజయలక్ష్మీ ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాల్లోని సమస్యల పరిష్కారం కోసం ప్రజలు అర్జీలు దాఖలు చేసుకోవాలని పేర్కొన్నారు. వచ్చిన అర్జీలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించనున్నట్లు ఆమె తెలిపారు.

నేడు చిల్లకల్లులో కలెక్టర్ పర్యటన

జగ్గయ్యపేట: మండలంలోని చిల్లకల్లు గ్రామంలో కలెక్టర్ డాక్టర్ జీ లక్ష్మీశ సోమవారం పర్యటిస్తారని ఎంపీడీఓ నితిన్ ఆదివారం తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు పాలశీతలీకరణ కేంద్రంలో పెయ్యిదూడలు పుట్టే లింగనిర్ధారిత వీర్యం పంపిణీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. పింఛన్ల పంపిణీని పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామ స్థాయి అధికారులు అందుబాటులో ఉండాలని ఆయన కోరారు.